గొల్లపల్లి శివారులో రాతిపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

టెర్రర్.. ట్రాన్స్‌ఫార్మర్

గోపాల్‌పేట, జూలై 14: రేపల్లి మండలంలోని గొల్లపల్లి శివారులో బోరు మోటర్ల విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెపై కాకుండా రాతి గుండుపై ఏర్పాటు చేశారు. రాతి గుండుపై వినూత్నంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం చూసినవారు ఇలా కూడా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయవచ్చా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఏదీఏమైనా అధికారుల ఐడియా అదుర్స్ అని నవ్వుకుంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఇలా ఏర్పాటు చేయడంతో మూగజీవాలు ప్రమాదాలబారిన పడే అవకాశం లేకపోలేదని.. సరైన క్రమంలో దిమ్మెపై అమర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తుంగభద్ర డ్యాంకు వరద

అయిజ, జూలై 14 : కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలోకి వరద వచ్చిచేరుతోంది. ఆదివారం టీబీ డ్యాంలోకి 14,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 203 క్యూసెక్కులు నమోదైంది. డ్యాం గరిష్ట నీటి నిల్వ 105.855 టీఎంసీల సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 31.709 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి ప్రస్తుతం 1606.81 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తిని ఇంటికి చేర్చిన పోలీసులు

తిమ్మాజిపేట, జూలై 14 : ఇంటి నుంచి తప్పిపోయిన వ్యక్తిని పోలీసులు ఇంటికి చేర్చారు. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన దెబ్బ నాగయ్య అనే వ్యక్తి దాదాపు ఏడు నెలల కిందట తప్పిపోగా, అతని కోసం కుటుంబ సభ్యులు అన్ని చోట్లా వెతికినా ఫలితం లేకపోయింది. అయితే సదరు నాగయ్య కామారెడ్డి జిల్లా బీబీపేట బస్టాండ్‌లో తిరుగుతుండగా,అదే గ్రామానికి చెందిన నందకుమార్, శ్రీనివాస్ అనే వ్యక్తులు అతనితో మాట్లాడి అతని వివరాలు తెలుసుకొని తిమ్మాజిపేట పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఎస్సై నరేందర్‌రెడ్డి నాగయ్యను అక్కడి నుంచి రప్పించి గుమ్మకొండలోని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సూర్యనమస్కారాలతో ఆరోగ్య ప్రాప్తి

- జ్ఞాన ఐశ్వర్య సిద్ధికి సరస్వతీ హోమాలు
- కృష్ణజ్యోతి స్వరూపానందస్వామీజీ

నాగర్‌కర్నూల్, జూలై 14 : సూర్య నమస్కారాలతో శారీరక, మానసిక ఆరోగ్య పాప్తి సిద్ధిస్తుందని శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానందస్వామీజీ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో ప్రారంభించిన యాగాశాలలో ఆదివారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని జన్మల సంచితపాపం వల్ల, ఇతర కారణాల వల్ల అనుభవించే మానసిక, శారీరక వ్యాధులను హరించే టటువంటి సూర్య, అరుణ హోమాలు, జ్ఞాన సముపార్జనకు సరస్వతి హవనాలను భక్తులచే సామూహిక హోమంలో భాగంగా 207మంది దంపతులతో ఆచరింపజేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ నమస్కార ప్రియ భాస్కరః, నమస్కారం వల్ల సూర్యుడు ప్రీతి చెందుతాడని, జన్మజన్మల పాపం వల్ల వేధిస్తున్నటువంటి కుష్టు, పండు, జగంధర, ఇత్యాది రోగాలు మనందరికీ రాకుండా ఉండాలంటే, మానసిక బలం పెరగాలంటే సూర్య నమస్కారాలు అత్యంత సులువైన మార్గమన్నారు. యాగశాలలో

సూర్యనమస్కారాలు ఆచరిస్తున్న భక్తులు

కార్యక్రమాలను బ్రాహ్మణులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 8వ రోజు ఆదివారం గోపూజ, యాగశాల ప్రదక్షిణ మొదలు అత్యంత వైభవంగా వేద హోమాలు, చండీహోమాలు, రుద్రహోమాలు, రామాయణం, భాగవతా సుందరకాండ చతుర్వేద హోమాలు సామవేద యజుర్వేద, ఆధర్వణ తదితర కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. నిత్యపూజలతోపాటు సామూహిక హోమాలలో భాగంగా సంతాన ప్రాప్తికి పుత్ర కామేష్టి హోమాలు 22మంది దంపతులతో నిర్వహించారు. సాయంత్రం ఎంతో వైభవంగా చిన్న పిల్లలను అమ్మవారి రూపంగా భావనచేసి బాల పూజలు నిర్వహించారు. బాలారిష్ట దోషాలు తొలగాలని, సంతానంలేని వారికి శీఘ్రంగా సత్సంతానం కలగాలనే సంకల్పంతో ఉత్తరకామేష్టి యాగం ఈ క్రతువును ఆచరించారు. అనంతరం పరమేశ్వరుడికి ప్రీతిగా రుద్రాక్రమార్చనతో బిల్వదళాలతో విశేష అర్చన నిర్వహించారు. పూజ అనంతరం బ్రాహ్మణులు భక్తులందరికీ వేద ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ఈ రోజు 9వేల మందికిపైగా అన్న ప్రసాదం స్వీకరించారు.

నేటి కార్యక్రమాలు..

చండీయాగం కార్యక్రమాల్లో భాగంగా 15వ తేదీన సోమవారం అమృత పాశుపత మృత్యుంజయ సహిత రుద్ర హోమాలని సామాజిక హోమాల్లో భాగంగా భక్తులతో చేయించనున్నారు. సాయంత్రం 10వేల లింగాలకు అర్చన, పంచామృతాభిషేకాలు, 203లీటర్ల ఆవుపాలతో భక్తులతో సామూహిక అభిషేకాలు, లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్నట్లు స్వామీజీ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

సూర్య యంత్రానికి పూజలు చేస్తున్న పండితులు

పొంచి ఉన్న ప్రమాదం..!

- పార్‌బాయిల్డ్ రైస్‌మిల్‌తో వాయుకాలుష్యం
- ఆందోళనలో అధ్యాపకులు, విద్యార్థులు

కళాశాల ఆవరణలో చేరిన వాయు కాలుష్య రేణువులు

నాగర్‌కర్నూల్, జూలై 14: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి సమీపంలోగల డిగ్రీ కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు వాయు కాలుష్యం భయం పట్టుకున్నది. పక్కనే ఉన్న పార్‌బాయిల్డ్ రైస్‌మిల్ నుంచి కాలుష్య రేణువులు కళాశాల ఆవరణలో వచ్చి పడుతుండడంతో విద్యార్థులు, అధ్యాపకులు భయాందోళన చెందుతున్నారు. పక్కన ఉన్న రైస్ మిల్ నుంచి ప్రమాదం పొంచి ఉందని గతంలో గుర్తించినప్పటికీ ప్రభుత్వ ఆధ్వర్యంలో అక్కడ నిర్మించిన నూతన భవనంలో సైన్స్ డిగ్రీ కళాశాలను కొనసాగిస్తున్నారు. ఈక్రమంలో రైస్‌మిల్ నుంచి వాయు కాలుష్యం గాలిలో కలవడంతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఈ కాలుష్యం వల్ల విద్యార్థులకు తీవ్రమైన తలనొప్పి, కళ్ల మంటలు, శ్వాస సంబంధిత సమస్యలతో తల్లడిల్లుతున్నట్లు అధ్యాపకులు గుర్తించారు. వాయి కలుష్యం వల్ల తరచూ అస్వస్థతకు గురికావాల్సి వస్తుందని విద్యార్థులతోపాటు, అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే దీర్ఘకాలిక రోగాల బారిన పడే అవకాశం లేకపోలేదు. ఈ విషయమై తక్షణమే స్పందించి వాయు కాలుష్యం నుంచి విద్యార్థులను కాపాడాలని అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. నెలరోజులుగా కళాశాల ఆవరణలోకి నల్లటి దుమ్ముతో కూడిన రేణువులు పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై గతంలో మిల్లు యాజమాన్యానికి తెలియజేసినా పట్టించు కోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాధికారులు స్పందించి తమను వాయుకాలుష్యం నుంచి కాపాడాలని విద్యార్థులు కోరుతున్నారు.

చెల్లిని గర్భవతిని చేసిన అన్న

- బిజినేపల్లి మండలం కీమ్యాతండాలో ఘటన
- డోన్‌కు చెందిన వారిగా గుర్తింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసులు
- విచారణ చేపట్టిన బిజినేపల్లి పోలీసులు

కీమ్యాతండా ఘటనపై వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్, జూలై 14 : తోబుట్టువుని అన్న గర్భవతిని చేసిన ఓ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం కీమ్యాతండాలో చోటు చేసుకున్నది. మూడు రోజుల కిందట వెలుగులోకి రాగా పోలీసులు విచారణ చేపట్టి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా డోన్ ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించారు. ఈ మేరకు డీఎస్పీ శ్రీనివాసులు విలేకరులకు వివరాలు వెల్లడించారు. కర్నూలు జిల్లా డోన్ ప్రాంతానికి చెందిన ఓ మహిళకు కేశవులు(22) అనే కుమారుడు ఉన్నాడు. కొంతకాలం తర్వాత భర్త మరణించడంతో ఆమె మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటూ మరో వ్యక్తిని పెండ్లి చేసుకుంది. వీరికి ముగ్గురు కూతుళ్లు కలిగారు. కొద్దిరోజుల తర్వాత రెండో భర్త కూడా మరణించడంతో ముగ్గురు కూతుళ్లతో అక్కడే జీవిస్తుంది. మొదటి భర్త కుమారుడైన కేశవులు బిజినేపల్లి మండలం కీమ్యాతండాలో కులవృత్తి అయిన రాళ్లు కొట్టే వాడు. అతడికి వంట చేసి పెట్టేందుకు తన రెండో భర్తకు పుట్టిన ముగ్గురి కూతుళ్లలో ఒక కూతురిని కేశవులు వద్దకు పంపించింది. కానీ కామాంధుడైన కేశవులు తోబుట్టువు అనే విషయం మరిచి బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకొని శారీరకంగా అనుభవించాడు. దీంతో గర్భం దాల్చింది. ఇది గమనించిన చుట్టుపక్కల వారు తల్లికి సమాచారం ఇవ్వడంతో ఆమె మందలించింది. దీంతో కేశవులు ఆ బాలికను తీసుకొని రెండు వారాల పాటు వనపర్తి జిల్లా బుద్ధారం, పల్కంపల్లి, ఖిల్లాఘణపురం తదితర ప్రాంతాల్లో తిరుగుతున్నాడు. అనుమానం వచ్చిన కొందరు 1098 చైల్డ్‌లైన్‌కి సమాచారం ఇచ్చారు. దీంతో వనపర్తి చైల్డ్‌లైన్ అధికారులు జీరో ఎఫ్ఐఆర్‌పై కేసు నమోదు చేసి మహబూబ్‌నగర్‌కు బదిలీ చేశారు. అక్కడి పోలీసులు బిజినేపల్లి పోలీసులకు కేసును బదిలీ చేయడంతో వారిని అదుపులోకి తీసుకొని బాలికకు వైద్య పరీక్షల నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ దవాఖానకు తరలించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు బిజినేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

పాలంలోకి దూసుకెళ్లిన అంబులెన్స్

నారాయణపేటరూరల్, జూలై14: పేట మండలంలోని అప్పక్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం ధన్వాడ కు చెందిన 108 వాహనం పాలంలోకి దూసుకెళ్లింది. మండలంలోని బొమ్మన్‌పాడ్ గ్రామానికి వెళ్లి రోగిని తీసుకొని, నారాయణపేటలోని ప్రభుత్వ దవాఖానలో అడ్మిట్ చేసి, తిరిగి ధన్వాడకు వెళ్లే క్రమంలో ఈ ఘటన చోటు చేసుకొన్నది. డ్రైవర్ ఫోన్ చూస్తూ అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లే 108వాహనం పాలంలోకి దూసుకెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు పలువురు చర్చించుకొన్నారు.

పాలంలోకి దూసుకెళ్లిన 108 వాహనం

ప్రభుత్వం పేరుతో వచ్చే ఈ-నో టీసులతో జాగ్రత్త

కేంద్రం అడ్వైజరీ

న్యూఢిల్లీ, జూలై 14: ప్రభుత్వ కార్యాలయాల నుంచి అనుమానిత రీతిలో ఈ-మెయిల్ వస్తే అందులోని అధీకృత అధికారి పేరు, విభాగాన్ని ధ్రువీకరించుకోవాలని కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోని భారత సైబర్ క్రైమ్ సమన్వయ కేంద్రం (ఐ4సీ) ఆదివారం ఒక పత్రికా ప్రకటనలో ప్రజలను కోరింది. ఈ-నోటీసుల పేరిట పదే పదే వచ్చే నకిలీ-ఈ మెయిళ్లను నమ్మి సైబర్ మోసాల బాధితులుగా మారొద్దని హెచ్చరించింది. ఇలాంటి మెయిళ్లను చెక్ చేసేముందు అవి gov.inతో అంతమయ్యే అధీకృత ప్రభుత్వ వైబ్‌సైట్ నుంచి వచ్చాయా లేదో సరి చూసుకోవాలని కోరింది. అనుమానం వస్తే ఇంటర్నెట్‌లో సంబంధిత అధికారి పేరు సరైందో కాదో చెక్ చేసి సంబంధిత విభాగానికి ఫోన్ చేసి కనుక్కోవాలని సూచించింది. వివిధ ఈ-మెయిల్ అడ్రస్సులతో వచ్చే నకిలీ నోటీసులకు స్పందించొద్దని.. వాటి గురించి దగ్గర్లోని పోలీస్ స్టేషన్ లేదా సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయొచ్చని తెలిపింది. గత వారం ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ సచివాలయంలోని పలువురు అధికారులకు ఈ తరహా నకిలీ ఈ-నోటీసులు వచ్చాయని చెప్పింది.

అతి విశ్వాసమే బీజేపీని దెబ్బ తీసింది

యూపీలో లోక్‌సభ ఫలితాలపై సీఎం యోగి ఆదిత్యనాథ్

లక్నో, జూలై 14: అతి విశ్వాసమే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని దెబ్బతీసిందని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ ప్రజలు అధికార బీజేపీకి ఊహించని షాక్ ఇచ్చారు. 2019లో 62 ఎంపీ స్థానాలు గెలుచుకున్న బీజేపీ, ఈ సారి 33 స్థానాలకు పరిమితమైంది. ఈ నేపథ్యంలో ఆదివారం లక్నోలో బీజేపీ యూపీ వర్కింగ్ కమిటీ సమావేశం వాడివేడిగా జరిగింది. సీఎం యోగి మాట్లాడుతూ, 'ప్రధాని మోదీ నాయకత్వంలో, యూపీలో ప్రతిపక్షంపై నిరంతరం ఒత్తిడి పెంచాం. దీంతో 2014, 2017, 2019 ఎన్నికల్లో విజయం సాధించాం. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు ప్రతిపక్షానికి బదిలీ అయ్యాయి. ఇది మన అతి విశ్వాసం వల్లే జరిగింది. మన అంచనాల్ని తలకిందులు చేసింది. ఓటమితో నీరసపడిన ప్రతిపక్షం.. ఇప్పుడు గెలుపును అందుకొని పుంజుకుంది' అని అన్నారు. ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు తాజాగా జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీజేపీ ఘోర పరాభావాన్ని పొందింది.

ఢిల్లీ దవాఖానలో కాల్పులు.. రోగి మృతి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని జీటీబీ హాస్పిటల్‌లో ఓ టీనేజర్ ఆదివారం జరిపిన కాల్పుల్లో ఓ రోగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రియాజుద్దీన్ (32) పొత్తి కడుపు ఇన్ఫెక్షన్‌తో గత నెల 23 నుంచి ఈ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. 24వ వార్డులో ఉన్న ఆయనపై 18 ఏళ్ల యువకుడు జరిపిన కాల్పుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారు. వ్యక్తిగత కారణాల వల్లే కాల్పులు జరిపినట్లు తెలుస్తున్నదని డిప్యూటీ పోలీస్ కమిషనర్ (సహదర) సురేంద్ర చౌదరి చెప్పారు.

30 ఏండ్లకు తెరుచుకున్న ఉమా భగవతి ఆలయం

శ్రీనగర్: జమ్ముకశ్మీరులోని అనంత్‌నాగ్ జిల్లాలో ఉన్న ఉమా భగవతి దేవాలయాన్ని సుమారు 30 ఏండ్ల తర్వాత తిరిగి తెరిచారు. కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ సమక్షంలో ఆదివారం ఉమా భగవతి ప్రాణప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. పునరుద్ధరణ పనులు పూర్తి కావడంతో ఈ దేవాలయంలో పూజలు చేయడానికి భక్తులకు అనుమతి ఇచ్చారు.

ఆగస్టునాటికి దేశవ్యాప్తంగా 'యూ-విన్'

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సాధారణ టీకాల కార్యక్రమ ట్రాకింగ్, నమోదు కోసం ఆగస్ట్ చివరి నాటికి యూ-విన్ పోర్టల్ అందుబాటులోకి రానుందని అధికార వర్గాలు తెలిపాయి. కొవిడ్ వ్యాక్సినేషన్ పోర్టల్ కొ-విన్‌కు నకలుగా ఉండే ఈ పోర్టల్‌ను పశ్చిమ బెంగాల్ మినహా మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నారు. గర్భిణులు, అయిదేండ్ల లోపు పిల్లలకు వేసే ప్రతి టీకాను యూ-విన్‌లో నమోదు చేయనున్నారు. క్యూఆర్ కోడ్ ఆధారంగా పనిచేసే ఈ పోర్టల్‌లో ఈ-టీకా ధ్రువీకరణ పత్రాన్ని ఒక్క క్లిక్ ద్వారా పౌరులెవరైనా పొందొచ్చు. రియల్ టైమ్‌లో పనిచేసే ఈ పోర్టల్ లేదా ఆండ్రాయిడ్ మొబైల్ అప్లికేషన్‌లో కోరుకున్న టీకా కేంద్రాల్లో టీకాలు పొందడానికి పౌరులు స్వీయ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. టీకా వేయించుకొనే టైమ్‌ను షెడ్యూల్ చేసుకోవచ్చు.

కర్ణాటకలో బస్సు చార్జీల మోత!

- ఏకంగా 20 శాతం మేర పెంపు?
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశాం
- కేఎస్ఆర్టీసీ చైర్మన్ శ్రీనివాస్ వెల్లడి
- గత నెల పెట్రోల్, డీజిల్‌పై పన్నును 4 శాతం పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఏడాదిగా ప్రజలపై పన్నుల మోత
- సిద్ధరామయ్య సర్కార్‌పై జనాగ్రహం

తుమకూరు/బెంగళూరు, జూలై 14: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో సామాన్య ప్రజలపై మరో భారం పడనున్నది. రాష్ట్రంలో త్వరలో బస్సు చార్జీలు భారీ స్థాయిలో పెరుగనున్నాయి. దీనిపై కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(కేఎస్ఆర్టీసీ) చైర్మన్ ఎస్ఆర్ శ్రీనివాస్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. ప్రభుత్వ బస్సుల్లో చార్జీల పెంపు అనేది అనివార్యమని ఆయన పేర్కొన్నారు. బస్సు చార్జీలను 15-20 పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేఎస్ఆర్టీసీ ఇప్పటికే ప్రతిపాదనలు పంపిందని వెల్లడించారు. 'రెండు రోజుల క్రితం మా బోర్డు సమావేశం జరిగింది. బస్సు చార్జీలను 15-20 పెంచాలని మేం ప్రతిపాదనలు పంపాం. మిగతాది సీఎం సిద్ధరామయ్య విచక్షణపై ఆధారపడి ఉంటుంది. కేఎస్ఆర్టీసీ మనుగడ సాగించాలంటే, చార్జీల పెంపు తప్పనిసరి' శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇంధన, బస్సుల విడి పరికరాల ధరలు పెరిగాయని చెప్పారు. 2019 నుంచి రాష్ట్రంలో చార్జీల పెంపు లేదని, అదేవిధంగా కేఎస్ఆర్టీసీ ఉద్యోగుల వేతనాల సవరణ కూడా 2020 నుంచి జరుగలేదని, కాబట్టి టికెట్ ధరలను పెంచడం అవసరమని చెప్పుకొచ్చారు. గత మూడు నెలల కాలంలో కార్పొరేషన్‌కు రూ.295 కోట్ల నష్టం వచ్చిందని వెల్లడించారు.

గత ఏడాదిలో పన్నుల మోత

ఐదు గ్యారెంటీల పేరుతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల మోత మోగిస్తున్నది. వివిధ రకాల పన్నులు, ఇతరత్రా రూపాల్లో సామాన్యుడి జేబును గుల్ల చేస్తున్నది. ఇప్పటికే గైడెన్స్ వ్యాల్యూ ట్యాక్స్, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, రవాణా వాహనాలపై అదనపు సెస్, ఈవీలపై లైఫ్ టైమ్ ట్యాక్స్‌ను ఇబ్బడిముబ్బడిగా వసూలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గత నెలలో పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను దాదాపు 4 శాతం చొప్పున పెంచింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.3, లీటర్ డీజిల్ ధర రూ.3.02 మేర పెరిగింది. మరోవైపు పాల ధరలను కూడా లీటర్, అర లీటర్ ప్యాకెట్లపై రూ.2 చొప్పున కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) పెంచిన విషయం తెలిసిందే.

గ్యారెంటీలకు అడ్డంగా కోతలు

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఐదు గ్యారెంటీల ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టింది. ఆ గ్యారెంటీలను అమలు చేయాలంటే వేలాది కోట్ల రూపాయలు అవసరం. అయితే నిధుల అందుబాటును పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా హామీలిచ్చేసిన కాంగ్రెస్.. అధికారం చేపట్టిన తర్వాత ఆయా గ్యారెంటీలకు ఆంక్షలు, కోతలతో ఎగనామం పెడుతున్నది. 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీశారని, మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించారని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చారని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీమ్ లోనూ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్ము కశ్మీరులోని కేరన్ సెక్టర్‌లో ఆదివారం ముగ్గురు ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుబెట్టింది. నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి భారత్‌లోకి చొరబడేందుకు వీరు చేసిన ప్రయత్నాలను విఫలం చేసింది. వీరి వద్ద నుంచి ఆయుధాలను, యుద్ధ సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సైన్యం ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. ఉగ్రవాదుల చొరబాట్ల నిరోధక కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు వివరించింది.

మణిపూర్‌లో మిలిటెంట్ల దాడి

సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి

ఇంఫాల్, జూలై 14: మణిపూర్‌లో భద్రతా బలగాలపై మిలిటెంట్లు జరిపిన దాడిలో ఓ సీఆర్‌పీఎఫ్ జవాన్ ప్రాణాలు కోల్పోయాడు. జిరిబామ్ జిల్లా మాంగ్‌బంగ్ గ్రామంలో ఆదివారం ఉదయం సీఆర్‌పీఎఫ్, పోలీసులు కలిసి గాలింపు చేపడుతుండగా, సాయుధులైన కొందరు దుండగులు దాడి చేశారు. కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన అజయ్ కుమార్ ఝా (43) మృతి చెందగా, ఒక పోలీస్ గాయపడ్డాడు. అతడిని వెంటనే దవాఖానకు తరలించగా, ప్రాణాపాయం తప్పింది. ఈ కాల్పుల్లో భద్రతా దళాలకు చెందిన ఒక వాహనం కూడా ధ్వంసమైంది. కుకీ జాతికి చెందిన మిలిటెంట్లు ఈ దారుణానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో 20 లక్షల టోకరా

హైదరాబాద్‌కు చెందిన పీహెచ్‌డీ స్కాలర్ అరెస్టు

న్యూఢిల్లీ, జూలై 14: క్రిప్టోకరెన్సీ పేరుతో ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.20 లక్షలు కాజేసిన హైదరాబాద్‌కు చెందిన పీహెచ్‌డీ స్కాలర్ అఖిలేశ్వర్ రెడ్డిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. మరొక నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ద్వారకా డీసీపీ అకింత్ సింగ్ చెప్పారు. క్రిప్టోకరెన్సీ కొనుగోలు, అమ్మకం ద్వారా భారీ మొత్తంలో ఆదాయముంటుందని, తన నుంచి రూ.20.16 లక్షలు పెట్టుబడిగా తీసుకుని మోసం చేశారని ఢిల్లీలోని ద్వారకకు చెందిన అక్షయ్‌కుమార్ సింగ్ నేషనల్ సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన ఢిల్లీ పోలీసులు.. నిందితులు హైదరాబాద్‌కు చెందిన వారని గుర్తించారు.

నిన్న వాల్మీకి.. నేడు వక్ఫ్ బోర్డ్

కర్ణాటకలో నిధుల గోల్‌మాల్

బెంగళూరు, జూలై 14: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో అవినీతి బాగోతాలు మెల్లమెల్లగా బయటపడుతున్నాయి. వాల్మీకి కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న భారీ కుంభకోణం (రూ.187 కోట్ల వరకు నిధుల దారిమళ్లింపు) మరువకముందే, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లో మరో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. గతంలో వక్ఫ్ బోర్డ్ సీఈవోగా పనిచేసిన జుల్ఫీకరుల్లా రూ.4 కోట్ల నిధుల్ని అక్రమంగా తరలించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. నిధులు కాజేసిన అతడిపై చర్యలు చేపట్టాలని వక్ఫ్ బోర్డ్ ప్రస్తుత సీఈవో మీర్ అహ్మద్ అబ్బాస్ బెంగళూరులోని హై గ్రౌండ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వక్ఫ్‌బోర్డ్‌కు అతడి వల్ల రూ.8.03 కోట్లు నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు. 'గుల్బర్గా దర్గాలో వక్ఫ్ భూముల్ని తీసుకున్నందుకు ప్రభుత్వం రూ.2.29 కోట్లు చెల్లించింది. అలాగే ఎండోమెంట్ శాఖ నుంచి రూ.1.79 కోట్లు వక్ఫ్ బోర్డ్‌కు జమయ్యాయి. మొత్తం రూ.4,00,45,465 వక్ఫ్ బోర్డ్ బ్యాంక్ ఖాతాలో జమైంది. ఈ మొత్తాన్ని 2016 నవంబర్ 26న అప్పటి సీఈవో జుల్ఫీకరుల్లా తన బ్యాంక్ ఖాతాలోకి అక్రమంగా బదిలీ చేశాడు' అని సీఈవో అబ్బాస్ చెప్పారు. అయితే నిధుల్ని కాజేసిన ఇన్నేండ్ల తర్వాత 2024 జూన్ 12న వక్ఫ్ బోర్డ్ ఫిర్యాదు చేయటం సంచలనంగా మారింది. వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో జరిగినట్టుగానే వక్ఫ్ బోర్డ్‌లో నిధులు దారిమళ్లటం రాష్ట్రంలో సంచలనం రేపింది. వాల్మీకి స్కామ్‌లో ఏకంగా రాష్ట్ర మంత్రి బీ నాగేంద్ర సహా 11 మంది అరెస్టు అయ్యారు.

ఎక్స్‌లో 10 కోట్లకు చేరిన మోదీ ఫాలోయర్లు

న్యూఢిల్లీ: ఎక్స్ సామాజిక మాధ్యమంలో ప్రధాని మోదీ రికార్డు సృష్టించారు. ఆయనను ఫాలో అవుతున్నవారి సంఖ్య ఆదివారం 10 కోట్లను దాటింది. గడచిన మూడేళ్లలో దాదాపు 3 కోట్ల మంది ఫాలోయర్స్ పెరగడం విశేషం. అంతర్జాతీయ స్థాయిలో ఎక్స్ వేదికపై ఎక్కువ మంది ఫాలో అయ్యే ప్రభుత్వాధినేత మోదీనే. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు 2.75 కోట్ల మంది, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి 2.64 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు 3.81 కోట్ల మంది, తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌కు 2.15 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు.

అందరికీ ఇన్సూరెన్స్!

- బీమా చట్టానికి సవరణలు
- బడ్జెట్ సమావేశాల్లో కేంద్రం బిల్లు

న్యూఢిల్లీ: బీమా చట్టం, 1938ని సవరించడం కోసం ఓ బిల్లును రానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశా